క్లుప్తంగా

విద్యార్థినికి షర్మిల చేయూత



నగదు అందజేస్తున్న షర్మిల

కూసుమంచి: మండలంలోని ధర్మాతండాకు చెందిన జర్పుల సింధూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆస్పత్రికి వెళ్లి సింధూ ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో సింధూ సోదరుడు సందీప్ మృతి చెందగా తల్లిదండ్రులను ఓదార్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'మన ఊరు-మన బడి' పనుల పరిశీలన

ఖమ్మంరూరల్: మండలంలోని జలగం నగర్, తెల్దారుపల్లి, ఏదులాపురం, గోళ్లపాడు, పోలేపల్లి పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను గురువారం ఎంఈఓ శ్యాంసన్, ఏఈ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, ఇందుకు ఎస్‌ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని కోరారు.

21న 'నెల నెలా వెన్నెల'

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 21న సాయంత్రం 6 గంటలకు నెలనెలా వెన్నెల 70వ నెల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ కళాబృందంచే 'కలిసుంటే' హాస్యనాటిక ప్రదర్శన, చిన్నారి శ్వేత వర్ధిని అమర్లపూడి కూయిపూడి నృత్యం, ఫణిల్ కనకాల శిష్య బృందం భరత నాట్యం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

టీఎస్‌ఆర్‌జేసీలో 'త్రివేణి' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల కామన్ ఎంట్రెన్స్ టెస్టు(టీఎస్‌ఆర్‌జేసీ)లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, కృష్ణవేణి, విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. మణి చంద్రసాయి 128, ప్రకాష్ 117, శ్రావణ్ 106, వందకుపైగా ముగ్గురు విద్యార్థులు సాధించారన్నారు. సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, క్యాంపస్ ఇన్‌చార్జ్ సందీప్, అకాడమిక్ ఇన్‌చార్జ్ ముస్తాఫా, అశోక్ పాల్గొన్నారు.

నాణ్యత పాటించి మద్దతు ధర పొందాలి

నేలకొండపల్లి: మొక్కజొన్న కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతుధరను పొందాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి కె.అరుణ సూచించారు. మండలంలోని రాయగూడెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం గురువారం పరిశీలించారు. మొక్కజొన్న తేమశాతం పరిశీలించారు. కాంటాలు వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కె.అరుణ, ఏఈఓ శిరీష, అవినాష్, మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంపై కలెక్టర్‌కు ఫిర్యాదు..

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో పారిశుధ్య కార్యక్రమాలు పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని సమస్య పరిష్కరించాలని గురువారం గ్రామస్తులు కలెక్టర్ వి.పి గౌతమ్‌కి విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ సంబందిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ జయరాంను వివరణ కోరగా స్పెషల్ డ్రైవ్‌లో సమస్యను పరిష్కరిస్తామని, నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఫాస్ట్ ఎక్స్
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	అన్ని మంచి శకునములే
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మం గాంధీచౌక్

అల.. ఈత కొలనులో..

పటేల్ స్టేడియంలో మూడు పూల్స్ కిటకిట

- స్విమ్మింగ్ నేర్చుకునేందుకు చిన్నాపెద్దల ఆసక్తి
- ఔత్సాహికులకు తోడు వర్ధమాన క్రీడాకారులతో సందడి



చిన్న పూల్‌లో చిన్నారులు



స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: చిన్నారుల కేరింతలు, నేర్చుకోవాలనే తపనతో ఔత్సాహికులు... పోటీలకు సిద్ధమవుతున్న వర్ధమాన క్రీడాకారులు వెరసి నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్‌లో కోలాహలంగా కనిపిస్తోంది. మామూలు సమయాల్లో కేవలం శిక్షణ పొందుతున్న, పోటీలకు సిద్ధమవుతున్న వారే వస్తుండగా.. ఇప్పుడు వేసవి సెలవులు కావడంతో నేర్చుకోవాలనే తపన ఉన్న చిన్నాపెద్ద బారులు దీరుతున్నారు. రోజురోజుకు వీరి సంఖ్య గణనీయంగా పెరగడంతో అందరికీ సమయం కేటాయించడం ఇబ్బందినే ఉన్నప్పటికీ నిర్వాహకులు వీటిని అధిగమిస్తూ నేర్పిస్తున్నారు. ప్రస్తుతం కేవలం చిన్నారులే 300 మంది వస్తున్నారంటే ఆసక్తి అర్థం చేసుకోవచ్చు. గత నెలలో 913 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా, ఈ నెలలో 350 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం స్విమ్మింగ్ పూల్ సందడిగా కనిపిస్తోంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇందులో సత్తా ఉన్న వారికి గుర్తించి సెలవులు ముగిశాక కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తాం. అసోసియేషన్ పరంగా జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనేలా చూస్తాం. ఇప్పటికే జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగారు.

– కొండల్‌రావు, స్విమ్మింగ్ కోచ్

పోటీల్లో పాల్గొనే లక్ష్యం..



గత రెండేళ్ల నుంచి నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా. ఇప్పటికే రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నాను. కానీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలనేదే నా లక్ష్యం. కోచ్ బాగా తర్ఫీదు ఇస్తున్నారు. ఆయన చెప్పే మెళకువలను పాటిస్తూ బటర్‌ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్లలో రాణించేందుకు కృషి చేసి పతకాలు సాధిస్తా.

– కె.పవన్, ఖమ్మం

కష్టమైనా ఇష్టంగా..



స్విమ్మింగ్ చేస్తుంటే కష్టంగా కాళ్లు రెండూ ఒకేసారి కొట్టాల్సి ఉండడం కాస్త కష్టంగా ఉంది. అయినప్పటికీ ఆసక్తి ఉండడంతో ప్రతీరోజు వస్తూ నేర్చుకుంటున్నాను. మంచి స్విమ్మర్‌గా ఎదగాలన్నదే నా తపన. చాలా మంది వస్తున్నప్పటికీ అందరిపై దృష్టి సారించి నేర్పిస్తున్నారు.

– కె.సహస్ర, ఖమ్మం

జిల్లాకు పతకాలు తీసుకొస్తా



జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఈసారి జరిగే జాతీయ స్థాయి క్రీడల్లోనూ తప్పక పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది. గత రెండేళ్లుగా కోచింగ్ తీసుకుంటుండడం, కోచ్ ఇచ్చే సలహాలు పనికొస్తాయి.

– వి.శ్రీనివాస్, స్విమ్మర్

సమస్యలతో ప్రజలు సతమతం



మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై పోరాటాలు సాగించాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. గురువారం కూసుమంచిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, అట్టి సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ సమస్యలు అన్నీ పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళనలు చేపట్టాలన్నారు. మల్లెల సన్మంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్, మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, నాయకులు శీలం గురుమూర్తి, రాజు, గన్యానాయక్, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, సంగయ్య, కర్ణబాబు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాల సేకరణపై వివరిస్తున్న ఏడీఏ

నేలకొండపల్లి: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఇఫ్కో, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షల పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి పరీక్షలు అనంతరం ఫలితాలను బట్టి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఎరువుల వాడకంను తగ్గించాలన్నారు. పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యతను ప్రతీ రైతు తెలుసుకోవాలన్నారు. అధికారుల సూచన మేరకు పంటలు సాగు చేసుకోవాలని, విచక్షణ రహితంగా పురుగుల మందులు వాడొద్దని సూచించారు. అనంతరం రైతు వేదిక వద్ద మట్టి నమూనాను క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.అరుణ, ఏఈఓలు దుర్గభవాని, గ్రామ కోఆర్డినేటర్ శంకర్, సింగారెడ్డిపాలెం రైతు శిక్షణ కేంద్రం అధికారి రాఘవయ్య, దేశీ విద్యార్థులు ప్రవీణ్, రామారావు, రాధాకృష్ణ, రైతులు రామకృష్ణ, గోగినేని వెంకటసీతారామారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న నాగండ్లకోటి

ఖమ్మంఅర్బన్: గ్రానైట్ వృత్తిలో నెలకొన్న వివిధ రకాల సమస్యల పరిష్కారం, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలను రాబట్టడానికి యజమానులంతా ఐక్యంగా పోరాడాలని టైల్స్, పాలిషింగ్ యజమానుల సంఘం మాజీ అధ్యక్షుడు, కార్పొరేటర్ నాగండ్లకోటి అన్నారు. బుధవారం రాత్రి ఖమ్మం గ్రానైట్ టైల్స్, పాలిషింగ్ యజమానుల సంఘం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, యజమానులకు వ్యాపారపరంగా ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. అనంతరం 2023–2025 సంవత్సరం నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ గౌరవ సలహాదారులు బిళ్లగిరి వెంకటేశ్వర్లు, నాగండ్ల జగదీష్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా బిల్లగిరి వెంకటేశ్వర్లు, సైదులు, ప్రెసిడెంట్‌గా మహమ్మద్ నసీరుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా టి.విజయ భాస్కర్, కోశాధికారిగా ఆర్.భిక్షమారెడ్డి , ఉపాధ్యక్షుడిగా జె.స్టాలిన్, టి. శ్రీనివాస్, ఎల్.సురేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్, కృష్ణ ఈసీ సభ్యులుగా రోశయ్య, రంగారెడ్డి, సందీప్, శ్రీనివాస్, అస్రార్, సతీష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో జర్నలిస్టుల కోసం 23 ఎకరాల భూమిని కేటాయిస్తూ కేబినెట్‌లో ఆమోదించడంపై సీఎం కేసీఆర్, మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటాలకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన సీఎం, మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవితో పాటు వెన్నబోయిన సాంబశివరావు, ప్రశాంత్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, రజనీకాంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుంపల భాస్కర్, సంతోష్, చక్రవర్తి, జానీపాషా, నాగరాజు, ఫయాజ్, మంద శరత్, రాజు, రవి, అమరవరపు కోటేశ్వరరావు, యలమదల జగదీశ్, అశోక్, గుద్దేటి రమేష్ బాబు,కొరకొప్పుల రాంబాబు పాల్గొన్నారు. అలాగే, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతోపాటు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, కురాకుల గోపి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా జిల్లా కేంద్రంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయింపును కేబినెట్ ఆమోదించడంపై టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి సీఎం, మంత్రులు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

చిరుజల్లులతో రైతుల అవస్థలు



మొక్కజొన్నలను కుప్ప చేస్తున్న రైతులు

తిరుమలాయపాలెం: గురువారం మండలంలోని రమణాతండా, ఎదుళ్లచెరువు గ్రామాలలో చిరుజల్లులు పడడంతో రైతులు పంటను దగ్గర వేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. కాగా పాలేరు నియోజకవర్గంలో జీళ్లచెరువులో మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో మండల రైతులు పంటను అక్కడికి తరలించాలంటే అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రైతుల కళ్లాల వద్దే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా జీళ్లచెరువు మార్క్‌ఫెడ్ కేంద్రం అధికారులు మండలంలోని రైతుల కళ్లాల వద్దనే పంటను కొనుగోలు చేసేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మాస శివరాత్రి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ దివాకర్, డీఎఫ్‌ఓ లావణ్య దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా అదనపు కలెక్టర్ దివాకర్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి లావణ్య దంపతులు గురువారం మహదేవునికి మాస శివరాత్రి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఖమ్మం నగరానికి చెందిన లావణ్య సకుటుంబంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత మహాదేవుడికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఈ మహోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి కృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వి.వెంకటాయపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ తేజావత్ కళావతి డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచానని, చిన్నకుమారుడు పంతులుకు చెందిన స్థలం కబ్జా చేసేందుకు కొందరు తమ ఇంటిని ధ్వంసం చేశారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

శిక్షణ పూర్తి



విద్యార్థులతో చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్‌లో పది రోజుల పాటు నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోర్సు శిక్షణ ముగిసినట్లు ఎస్‌బీఐటీ చైర్మన్ జి.కృష్ణ, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రిలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి(కారేపల్లి): బీఆర్‌ఎస్ దేశానికే ఆదర్శమని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియా నాయక్ అన్నారు. గురువారం పండితాపురం శ్రీనివాస్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ బీఆర్‌ఎస్ కార్యకర్త సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని, మూడోసారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ గుర్తుపై గెలిచి, జెడ్పీ చైర్మన్ పదవిని ఇస్తే.. ఖమ్మంలో ఉన్న ఒకరిని చూసి, పార్టీపై విమర్శలు చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఎవరి బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ బాణోతు సునిత, ఎంపీటీసీ సునిత, అంతోటి అచ్చయ్య, సర్పంచ్‌లు మూడ్ దుర్గాజ్యోతి, కృష్ణారెడ్డి, సరిరాం నాయక్, కృష్ణప్రసాద్, భిక్షపతి, హరి, కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలతో ప్రమాదాలు



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక 26, 27, 39 డివిజన్ల కూడలిలో గుంతలతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రిక్కాబజార్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే చర్య తీసుకోకపోతే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, బండారు శ్రీనివాసరావు, శంకర్ గౌడ్, పాపని నాగ, శివ, రాజేష్, మారుతి, ఫనికుమార్, శర్మ, శ్రీనివాస్, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కైకొండాయిగూడెం పరిధిలో గల గ్రానైట్ పారిశ్రామికవాడలలో మౌలిక వసతులను కల్పించాలని 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు మేయర్ పునుకొల్లు నీరజకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీస సౌకర్యాలు లేక స్థానికులు, పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన మేయర్ నీరజ ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం గ్రానైట్ టైల్స్, పాలిసింగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నజీరుద్దీన్, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, భీష్మారెడ్డి, విజయభాస్కర్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సుల్తాన్, శ్రీనివాస్, అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

ఖమ్మంమయూరిసెంటర్: సుతారి మేస్త్రీ, కూలి రేట్లను భారీగా పెంచడంతో భవన నిర్మాణదారులపై పెనుభారం పడుతోందని, ఈ కూలి పెంపును నిరసిస్తూ క్రెడాయి, బిల్డర్స్ అసోసియేషన్ చేపట్టిన బంద్‌కు సహకరించాలని అసోసియేషన్ నగర అధ్యక్షుడు తుంపాల కృష్ణమోహన్ కోరారు. ఈ మేరకు గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్న భవనాల వద్దకు వెళ్లి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత ఇంటిని నిర్మించుకుందాం అనుకున్న వారికి పెరిగిన కూలీ రేట్లు భారం కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ బాధ్యులు దోసపాటి ప్రవీణ్, క్రెడాయ్ బాధ్యులు కొప్పు నరేష్, బండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేట్లు పెంచామనడం సరికాదు..

తాపీ వర్కర్స్ కూలి రేట్లు ఏకపక్షంగా పెంచామనడం సరికాదని, బిల్డర్స్ అసోసియేషన్ వారు తమతో సంప్రదించకుండానే సమావేశం పెట్టుకొని కూలీ రేటు రూ.800లు నిర్ణయించారని కార్మిక సంఘాల అఖిలపక్షనేతలు ఎం.శ్రీనివాసరావు, ఏ.లింగయ్యలు అన్నారు. గురువారం నగరంలో సీఐటీయూ, ఐఫ్టీయూ, ఏఐటీయూసీ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పక్క జిల్లల్లో ఉన్న రేట్లు, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచడం జరిగిందని, బిల్డర్స్ తమకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు మల్లికార్జున్, గూడా రాంబ్రాహ్మం, రమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణా పనులను అడ్డుకుంటున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అధ్వానంగా అంతర్గత రహదారులు

- రోడ్లపైనే నిలుస్తున్న మురుగు
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త



రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు



డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమై పదేళ్లు కావొస్తున్నా కనీస సౌకర్యాలు అందుబాటులోకి రాకపోవడంపై నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం వాసులు ఆవేదన చెందుతున్నారు. గ్రామం రెండు డివిజన్ల పరిధిలోకి రావడంతో సరిహద్దుగా ఉన్న ప్రధాన రోడ్డుపై ప్రయాణం సంకటంగా మారింది. రాత్రి మాటేమో కానీ పగలు కూడా రాకపోకలు సాగించాలంటేనే నరకయాతన పడుతున్నారు. కొద్దినెలల క్రితం ప్రధాన రహదారిని విస్తరించి డ్రెయిన్ నిర్మించారు. కానీ కొత్తగా రోడ్డు నిర్మించకపోవడంతో గుంతలమయమైన రహదారిపై వర్షం నీరు నిలవడమే కాక మురుగు నీరు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడ నిలుస్తోంది. ఫలితంగా డ్రెయిన్లు నిర్మించినా ఫలితం లేకుండా పోయింది. అలాగే, డ్రెయిన్లలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. రెండు డివిజన్లకు ఒకే పార్టీ కార్పొరేటర్లు ఉన్నా అభివృద్ధి వెనుకబడడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇక కార్పొరేషన్ అధికారులు ఇంటి పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం సరికాదని చెబుతున్నారు.